క్లుప్తంగా

చీకటి కాలనీలో కార్డెన్ సెర్చ్

నరసరావుపేట రూరల్: యల్లమంద పంచాయతీ పరిధిలోని చీకటి కాలనీలో బుధవారం రూరల్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున వంద మంది పోలీసులు కాలనీ చుట్టుముట్టి ఇంటింటికి వెళ్లి తనిఖీలు జరిపారు. సరైన ధృవపత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలను, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్టు తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్లు, అనుమానితులు, పాత కేసుల్లో నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. గంజాయి, అక్రమ మద్యంపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తనిఖీలో నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్, చిలకలూరిపేట టౌన ఎస్ఐ రహంతుల్లా, ట్రాఫిక్ ఎస్ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అక్రమ రవాణాను నిరోధించాలి

నరసరావుపేట: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నీడ్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత ప్రేమానందం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దిశ పోలీస్ స్టేషన్ సీఐ సుహాసిని, డీసీపీఓ శౌర్యులు, ఏసీటీపీఓ మాణిక్యాలరావు పాల్గొని మాట్లాడారు. ఏ గ్రామంలో పిల్లలు అక్రమ రవాణా జరగకుండా ప్రతి కుటుంబాన్ని చైతన్యవంతం చేయాలని అన్నారు. నీడ్స్ సంస్థ ఆర్గనైజర్ రవికుమార్, ఇశ్రాయేలు సూపర్‌వైజర్లు జ్యోత్స్న పాల్గొన్నారు.

రెడ్డిపేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న రెడ్డిపేరంటాలమ్మ ఆలయంలో నరసరావుపేట దేవాదాయ శాఖ ఈవో పందిటి వెంకాయమ్మ, బి.స్రవంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాతులూరు గ్రామానికి చెందిన కమ్మ కృష్ణప్రియతో కలిసి ప్రత్యేక పూజలు, శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురికి అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, సభ్యులు వేజెండ్ల శ్రీనివాసరావు, వజ్జా రామారావు, వెంకటరావు, సీతయ్య, కమ్మ శ్రీనివాసరావు, జంపని లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

వినుకొండ: పట్టణంలో అనాథ శవానికి అన్నీ తానై మానవ సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ అంత్యక్రియలు చేశారు. వినుకొండలోని ఏనుగుపాలెం రోడ్డులో సాగరిక వైన్స్ సమీపంలో ఓ చెట్టు కింద గుర్తుతెలియని మహిళా మృతదేహం సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు ఆ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పీవీ సురేష్, భవాని శంకర్, లోకేష్, క్రాంతి, ఏసుబాబు, రవి, నాగేంద్రబాబు, మహేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ కార్యక్రమాలు

బొల్లాపల్లి: ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా మండలంలోని నెహ్రూ నగర్ తండా, పలుకూరు గ్రామాల్లో రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలోఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ భాస్వరం ఎరువును పంట సాగులో దుక్కిలోనే వాడాలని, లేకుంటే మొక్క నాటిన 30 రోజుల్లోగా వాడుకోవాలన్నారు పంట విత్తిన 30 రోజుల తర్వాత భాస్వరం కాంప్లెక్స్ ఎరువులు వాడినట్లయితే పంటలో సూక్ష్మ పోషక లోపం కనిపిస్తుందని కాంప్లెక్స్ ఎరువులపై రైతులు అధిక వినియోగం చేయవద్దని సూచించారు. అనంతరం వినుకొండ ఏడీఏ సి.హెచ్.రవికుమార్ మాట్లాడుతూ పంటలు బీమాను రైతులు సద్వినియోగపరచు కోవాలన్నారు ప్రభుత్వం ద్వారా అమలయ్యే పథకాల గురించి, జీవన ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.జమునబాయి మండల వ్యవసాయ అధికారి ఎ.అంకారావు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.అరుణ ఏఈఓ లు గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట రూరల్: ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. పట్టణంలోని ఎరువుల గొడౌన్లల్లో బుధవారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎరువుల గొడౌన్‌లోని స్టాక్ రిజిస్టర్స్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించి ఎరువులను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఎరువులను విక్రయించినప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. రైతులకు రసాయన ఎరువులు, యూరియ, ఎంవోపీ భాస్వరం, కాంప్లేక్స్‌తో పాటు అన్ని రకాల ఎరు వులు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నా యని వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి పాల్గొన్నారు.

15714 మందికి పీఎంజేవై కార్డులు

రొంపిచర్ల: మండలంలోని 15,714 మందికి ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం కింద కార్డులు మంజూరు అయ్యాయని స్థానిక ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ పోతిరెడ్డి జగన్‌నరసింహారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుల లబ్ధిదారులు తమ ఆధార్ నంబర్‌తో లింకు అయిన ఫోన్ నంబర్లను జత చేయాల్సి ఉంటుందన్నారు.

కలసి కట్టుగా పనిచేస్తే విజయం మనదే

- మాజీఎమ్మెల్యే బొల్లాబ్రహ్మానాయుడు
- కూటమి పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం
- వినుకొండలో అరాచక పాలన చేస్తున్న టీడీపీ నాయకులు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


పాల్గొన్న కమిటీ సభ్యులు

వినుకొండ: పార్టీ బలోపేతానికి అనుబంధ సంఘాల పాత్ర ఎంతో కీలకమైనదని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అనుబంధ సంఘాల కమిటీల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు, పల్నాడు జిల్లాల అనుబంధ సంఘాల ఇన్‌చార్జి షేక్ మస్తాన్‌వలి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో బొల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు మద్దతు ధరల విషయంలో పూర్తిగా విఫలమైయిందన్నారు. నేడు వ్యవసాయం అంటే రైతులు భయపడే పరిస్థితి వచ్చారన్నారనీ, రైతులు సాగు చేసిన పంటలకు సరైన ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు పార్టీలు లేవని టీడీపీలో కూడా రైతులు ఉన్నారని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. వినుకొండలో అక్రమార్కుల ఆగడాలు ఎక్కువయ్యాయని, ఎక్కడ ఖాళీ భూములు కన్పించినా రాబందుల్లా వాలిపోతున్నారని మిద్దెబావి స్థలాలల్లో బలం ఉన్నవాళ్లదే స్థలమని బలహీనుల స్థలాలు లాక్కుని టీడీపీ నాయకులు అమ్ముకుంటున్నారన్నారు. ఏబీఎం ఆస్తులు అడ్డగోలుగా ఆక్రమిస్తుంటే అడిగే వారే లేరన్నారు. ఈ అక్రమాలు ఎమ్మెల్యే జీవీకి తెలియదాని ప్రశ్నించారు. ఇటీవల వెల్లటూరులో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే నెపంతో నిరుపేద కుటుంబాలకు చెందిన ఇళ్లను కూల్చివేయడం హేయమైన చర్య అన్నారు. విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, బాధితులకు ఆర్థిక సహాయంతోపాటు అన్నీవిధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నివిధాల విఫలమైందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేస్తే విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. వినుకొండ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని రాత్రికి రాత్రే మాయం చేశారని, ఇటీవల పట్టణంలో టీడీపీ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేశారని వాటిని కదిలించకుండా మహాత్మాగాంధీ విగ్రహాన్ని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఆ విగ్రహం ఎక్కడ ఉందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. వినుకొండ మున్సిపాలిటీలో దోపిడీ అడ్డగోలుగా జరుగుతోందని, 44 లక్షల గ్రాంట్ మంజూరైతే మురికి కాల్వల్లో పూడికతీత పనులు, నీళ్ల ట్యాంకర్ల పేరుతో దొంగ లెక్కలు చూపి డబ్బును బిల్లులుగా మార్చుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మీ అరాచకాలు చూడకపోయినా ప్రజలు మాత్రం మీలెక్క తేలుస్తారన్నారు. రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ అనుబంధ సంఘాలు పార్టీకి పట్టుకొమ్మలన్నారు. రానున్న రోజుల్లో అందరం సమష్టిగా కలసి పనిచేసి వినుకొండ నియోజకవర్గంలో మళ్లీ పార్టీ జెండాను ఎగరెయ్యాలని పిలుపు నిచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి జిల్లా అధికార ప్రతినిధి. ఎంఎన్ ప్రసాదులతోపాటు ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు, ఎం.వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు బూత్ కమిటీ నాయకులు కొత్త కృష్ణారెడ్డి, మహిళా కన్వీనర్లు చిన్నామ్మాయి, పెట్లూరి అనంతలక్ష్మీ, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ
- జిల్లాస్థాయి ప్రధానోపాధ్యాయులు శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని కనమర్లపూడిలోని సంసిద్ స్కూల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు మూడోవ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయాభావంతో పాటు క్రమశిక్షణలతో కూడిన గుణాత్మక విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కల్గిలా ఉపాధ్యాయులు బోధించి మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవటం ద్వారా ప్రతి పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం నూరుశాతం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన నైపుణ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రతి విద్యార్థి చదవటం రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలను చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు దృష్టిలో ఉంచుకొని తగిన రీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి సుభాని, ఎంఈవో పుసులూరి లలితకుమారి, ఎంఈవో పూర్ణచంద్రరావు, 212 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి విద్యాశాఖాధికారిగా యశోదర



బొల్లాపల్లి:మండల విద్యాశాఖ అధికారి 1 వి. యశోధర బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఇంచార్జ్ సయ్యద్ జప్రుల స్థానంలో యశోధర వినుకొండ పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఎఫ్ఏసీ మండల విద్యాశాఖ అధికారి 1 ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఎంఈఓ 1 మాట్లాడుతూ పాఠశాలలో సక్రమంగా పనిచేసేలా, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా కృషి చేస్తానని తెలిపారు.

బుల్లెట్ ప్రమాదంలో మరొకరు మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిలో మరో యువకుడు బుధవారం మృతి చెందాడు. గాయపడిన ముగ్గురిలో గతంలోనే ఒకరు మృతి చెందగా తాజాగా మరొక యువకుడు మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలూరిపేట నుండి గుంటూరు దిశగా ఆదివారం బుల్లెట్ వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈనెల 27న తిమ్మాపురం కొత్తబైపాస్ వంతెనపై జరిగిన ఈ ప్రమాదంలో మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన దొప్పలపూడి హనుమాకోటి శాస్త్రి, దండా గోపి, దిలిప్ ఉన్నారు. తీవ్రగాయాలైన వీరిని గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో బీటెక్ విద్యను పూర్తి చేసిన దొప్పలపూడి హనుమాకోటిశాస్త్రి (26) అదేరోజు రాత్రి మృతి చెందగా, 30న దండా గోపి మృతి చెందినట్లు వైద్యులు సోమవారం ధృవీకరించారు. కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ మృతదేహాన్ని శవ పంచానామ నిర్వహించి బుధవారం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. మూడో వ్యక్తి దిలీప్ చికిత్స పొందుతున్నాడు.

వరిలో అంతర్ పంటల విధానాన్ని ఆచరించాలి

జిల్లా ప్రకృతి వ్యవసాయ నిపుణులు సైదయ్య


ఈపూరులో పొలాన్ని పరిశీలిస్తున్న శిక్షకులు సైదయ్య

ఈపూరు (శావల్యాపురం): ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి పంటలో అంతర పంటల విధానాన్ని రైతులు ఆచరించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య అన్నారు. బుధవారం ఈపూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులు దారా ప్రకాష్‌రావు, కాటం చిన నాగరాజు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పైరులో అంతర పంటలు ఆకుకూరలు, దుంపజాతి పంటలు సాగు చేయటం ద్వారా స్థూల సూక్ష్మ పోషకాలు వరి పంటకు అందుతాయని అలాగే నీటి వినియోగం తగ్గటంతో పాటు పురుగులు తెగుళ్ల బెడద నియంత్రణకు దోహదపడుతుందన్నారు. వరి పంటకు ఆక్సిజన్ అధికంగా అందటం ద్వారా పిలకల శాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన పెట్టుబడులు తగ్గుతాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుకు ఆసక్తి చూపాలన్నారు.

నవోదయంలో యోగా సంబరం

నాలుగు రాష్ట్రాల విద్యార్థుల అద్భుత యోగా క్రీడా ప్రదర్శన



యోగా క్రీడా పోటీల ప్రదర్శన చేస్తున్న దృశ్యాలు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: రూరల్‌మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ) ప్రాంగణం యోగా సందడితో ఉప్పొంగుతోంది. ఈ నెల 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు జేఎన్‌వీల పరిధిలో జరుగుతున్న ప్రాంతీయస్థాయి యోగా ప్రదర్శన క్రీడా పోటీలు, జేఎన్‌వీ విద్యార్థులకు అద్భుతమైన స్ఫూర్తినిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 8 క్లస్టర్ల నుంచి 278 మంది యోగా శిక్షణ పొందిన క్రీడాకారులు తమ అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. జేఎన్‌వీలు విద్యార్థుల్ని అన్ని రంగాల్లో ప్రవేశాన్ని కల్పించి వారిని జోనల్, రీజియన్, నేషనల్ స్థాయి పోటీల్ని నిర్వహించి ప్రోత్సహించడం పట్ల అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ ఆనంద వ్యక్తం అవుతుంది.

యోగా వ్యాయామం కాదు, జీవన విధానం!

వేదికపై విద్యార్థులు ప్రదర్శిస్తున్న యోగా విశిష్టత, వాటి ప్రయోజనాలు చూపరులకు మానసిక, శారీరక నిగ్రహ శక్తికి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. యోగా అంటే కేవలం శరీరాన్ని వంచడం, శ్వాసను బిగబట్టడం కాదని, అది మానవ వ్యవస్థను అర్థం చేసుకునే విజ్ఞాన శాస్త్రమని..మన ఆనందానికి మనమే కర్తలని, మన భవితకు మనమే యజమానులుగా మారే సామర్థ్యాన్ని సాధించడమేనని ఈ ప్రదర్శనలు స్పష్టం చేస్తున్నాయి.

విభిన్న విభాగాల్లో అద్భుత ప్రదర్శనలు

ఈ యోగా క్రీడా పోటీలు గ్రూపుగానూ, వ్యక్తిగతంగానూ జరుగుతున్నాయి. ఆసనాలు, రిథమిక్, ఆర్టిస్టిక్ (కళాత్మక యోగా) వంటి మూడు రకాల ప్రదర్శనలు ఆడిటోరియంలో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తున్నాయి. ముఖ్యంగా అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరుగుతున్న యోగా క్రీడా పోటీలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సంగీతానికి అనుగుణంగా సాగే ఆసనాలు, మనోహరమైన కదలికలతో వరుస ఆసనాల ద్వారా ప్రదర్శకులు తమబలం, చురుకుదనం, చలనశీలత, మనోవశ్యత, సమతుల్యతను ఏకకృతం చేసి చూపిస్తున్నారు.

సాంస్కృతిక కలయిక, స్నేహానికి వేదిక

నాలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులంతా ఒకేచోట చేరడంతో మద్దిరాల నవోదయ విద్యాలయం సందడిగా మారింది. పోటీల్లో గెలుపోటముల గురించి పట్టించుకోకుండా, ఎంతో ఉత్సాహంగా గడుపుతూ, ఆయా రాష్ట్రాలకు చెందిన సంస్కృతి-సంప్రదాయాలు, వేష, భాషలను గురించి ఒకరినొకరు పంచుకుంటూ విద్యార్థులు ఆనందంగా సమయాన్ని గడుపుతున్నారు. ఇది కేవలం పోటీల వేదిక మాత్రమే కాకుండా, స్నేహబంధాలను పెనవేసుకునే ఓ అద్భుత అవకాశంగా మారిందంటూ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ సాధనకు ఉపయుక్తం

తొలిసారిగా యోగాక్రీడాపోటీలను చూస్తున్నాం. మద్దిరాల జేఎన్‌వీలో మాకు ఎంతో అందరి నుండి ఆదరణ లభించింది. జేఎన్‌వీల ఆధ్వర్యంలో ప్రాంతీయస్థాయిలో పాల్గొనడం విద్యార్థి జీవితంలో మరిచిపోని ఘట్టంగా నిలుస్తుంది. యోగా అనేది ఆరోగ్యం కోసమని భావన ఉండేది. యోగా పోటీలు ఉంటాయని, అది ఉద్యోగ సాధనకు ఉపయోగం అవుతుందని ఈ పోటీల ద్వారా గ్రహించాము.

–కె ప్రణయ్‌సిరి, ఎం.వాసవి, కె.అర్పిత, తెలంగాణ

ఆచార వ్యవహారాలు తెలుస్తాయి

దేశంలోని భిన్న కులమతాలు, విభిన్న సంస్కృతి సంప్రదాయాలు వారి ఆచార వ్యవహారాలు తెలుకునే వీలు ఈ పోటీలతో కలిగింది. వాటిని ఒకరినొకరం తెలుసుకోవడం ఆనందంగా ఉంది. ఇంతటి గొప్ప అవకాశం మాకు కల్పించిన జేఎన్‌వీ సంస్థకు థ్యాంక్స్

–అమియా, శ్రేయ, భవ్య, కేరళ

ఇదొక సదవకాశం

జేఎన్‌వీలో చేరడం వలనే అక్కడ గురువుల వద్ద యోగా నేర్చుకునే సదవకాశం కలిగింది. క్రమం తప్పకుండా శిక్షణ పొంది, గురువు వద్ద యోగాను నేర్చుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలుసుకున్నాం. నిత్య యోగసాధనతో ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు దోహదపడుతుంది.

సంగీత, ప్రజ్ఞ, స్ఫూర్తి, కర్ణాటక

విద్యార్థులకు వరం

మా ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరైన అతిథుల్లా..వివిధ రాష్ట్రాల జేఎన్‌వీ విద్యార్థులు మద్దిరాల జేఎన్‌వీకు యోగా పోటీల నిమిత్తం రావడం చాలా సంతోషంగా ఉంది. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించే లక్ష్యంగా క్రీడాకారులు పోటీపడుతున్నారు. అన్ని రంగాల్లో జేఎన్‌వీలు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం నిజంగా విద్యార్థులకు వరమని చెప్పాలి.

–జి.రిత్విక, పి.గీతిక, జె.యలమందకుమారి, కె.అనిత, ఆంధ్రప్రదేశ్

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి


క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వ ఏడాది ప్రజా వ్యతిరేక పాలనపట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 14,38 వార్డుల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ ప్రజలతో చేయించారు. ఈ సందర్భంగా దరియావలి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని అయినప్పటికీ సుపరిపాలన పేరుతో ఇళ్లకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు పరిచారని గుర్తు చేశారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశారని వెల్లడించారు. ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేటా ముంచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, కొమరవల్లిపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, 14వ వార్డు పార్టీ ప్రెసిడెంట్ షేక్ జాన్‌సైదా, నాయకులు కొప్పురావూరి పటేల్, బండారు జయకుమార్, తుపాకుల రామకృష్ణ, గోపతోటి జాన్, ఊసా రమేష్, కొచ్చెర్ల కిషోర్, సయ్యద్ జమీర్; ఇర్రి రాఘవ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఏకాబంరపు సునీత, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు దాసరి అంజలి, డీలర్ సుభాని, నాగూర్, బిలాల్, బాజి, అముదాల అంజి, అన్నపరెడ్డి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో ఉద్యోగావకాశాలు

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధర్‌రావు



విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేస్తున్న అతిథులు

నరసరావుపేట రూరల్: ఫార్మసీ రంగం భవిష్యత్‌లో కూడా ప్రజారోగ్యానికి కేంద్ర బిందువుగా ఉంటుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధర్‌రావు తెలిపారు. పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో బుధవారం స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ గంగాధరరావు ముఖ్యఅతిథిగా, హైద్రాబాద్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ అమిత్ అస్తానా అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ ఫార్మసీ విద్యను పూర్తిచేసిన విద్యార్థులు కేవలం ఫార్మసిస్ట్‌లుగా మాత్రమే కాకుండా పరిశోధకులుగా, పరిశ్రమలలో నూతన మార్గదర్శకులుగా ఎదగాలని తెలిపారు. ఇండస్ట్రీ, క్లినికల్, రెగ్యులేటరీ, అకడమిక్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు అభ్యాసాన్ని నిలకడగా కొనసాగిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో మానవీయ విలువలతో ఎదగాలని సూచించారు. డాక్టర్ అమిత్ అస్తానా మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి ఔషధాలను సరఫరా చేసే ప్రముఖ దేశంగా ఎదుగుతుందని తెలిపారు. ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలు రోజురోజుకు పెరుగుతున్నాయని వివరించారు. డబ్బుతో పాటు గౌవరంతో కూడా కేరీర్ ఫార్మసీలో లభిస్తుందని తెలిపారు. డ్రగ్ డెవలప్‌మెంట్, పేటెంట్ లా, ఫార్మకో విజలెన్స్, మెడికల్ రైటింగ్ వంటి రంగాల్లో మంచిస్థాయిలో ఎదగవచ్చని సూచించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్‌భూషణ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


పామాయిల్ మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జీవీ

ఈపూరు(శావల్యాపురం):పామాయిల్ సాగు వలన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్‌తో పాటు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మొదట విడతలో ఈపూరు మండలం, రెండవ విడతలో వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాలు పామాయిల్ సాగుకు ఎంపిక చేయటం సంతోషంగా ఉందన్నారు. పామాయిల్ సాగు వల్ల ఎకరానికి రూ.లక్షన్నర వరకు ఆదాయం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సారథ్యంలో 15 రకాల ఉద్యాన పంటలు రాయితీ రైతులకు మంజూరు చేస్తుందన్నారు. అదే విధంగా పామాయిల్ పంటల కొనుగోలు ఒప్పంద పత్రాలను అందజేయటం మంచి శుభపరిణామమన్నారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగు చేయటం వలన రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్నారు. పామాయిల్ మొక్కలు కావల్సిన రైతులు సెల్ నంబరు 8712691619 నంబరు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో పాలడుగు రామకృష్ణబాబు, ఉద్యానశాఖాధికారి షేక్ నబీ రసూల్, ఏవో రామినేని రామారావు, ఈపూరు పామాయిల్ ఏరియా మేనేజరు నవీన్, పీఏసీఎస్ చైర్మన్ విడపలపాటి హనుమయ్య, రైతులు పాల్గొన్నారు.

అభ్యున్నతికి చొరవ చూపటం అభినందనీయం

ఎంపీడీవో సీతారామయ్య



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: నాబార్డు సారథ్యంలో నేచురల్ హెల్త్ సొసైటీ వారి సౌజన్యంతో మహిళలు జీవనోపాదులు పెంపుదలకు ప్రత్యేక చొరవ చూపటం అభినందనీయమని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఈడీ బల్బులు తయారు చేయడంలో నెలరోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేయు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నేచురల్ హెల్త్ సొసైటీ సీఈవో నూకతోటి భగవన్‌దాస్ పాల్గొని మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఒక్కో మహిళకు రూ. 50 వేలు తక్కువ వడ్డీకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. అలాగే శావల్యాపురంలో 10 మంది మహిళలకు చొప్పున మూడు యూనిట్స్ ఏర్పాటు చేసి తయారు చేసిన ఉత్పత్తులు బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నెలరోజుల శిక్షణ కాలంలో ఒక్కో మహిళకు రూ.750 రూపాయలు గౌరవ వేతనం వారి బ్యాంకుకు నేరుగా జమ చేశామన్నారు.

ఆట్యా- పాట్యా పోటీలకు వాగ్దేవి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీలకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు, వ్యాయామ అధ్యాపకుడు రాయల ఆంజనేయులు బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు బాలికల విభాగంలో బోరుగడ్డ సౌజన్య, షేక్.నజ్మా, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఒంగోలులో ఆగస్టు 9, 10 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పల్నాడు జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, పి.వి.అచ్యుతరావు, పాశం కృష్ణారావు, అధ్యాపకులు అభినందించారు.

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా పోటీలకు లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి తెలిపారు. నకరికల్లులో ఈనెల 27వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థులు పి.వరప్రసాద్, టి.మణిదీప్, జి.లక్ష్మీప్రశాంత్, కె.వైష్ణవిలు పాల్గొని ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 8,9 తేదీలలో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు.

బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నవ పద్మావతి, షేక్ ఫాతిమా, బి.తిరుపతిరావు, షేక్ రషీదాబీ, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఎవరో.. ఈ గుర్తుతెలియని మృతుడు?



నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోని శ్రీ శృంగేరి శంకర మఠం పక్కన కృష్ణవేణి నర్సింగ్ కాలేజీ వద్ద ఖాళీ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్ టౌన్ ఎస్ఐ అరుణ బుధవారం తెలిపారు. మృతుడి ఆచూకీ మరియు అతని పేరు తెలియ రాలేదన్నారు. ఎవరికైనా అతని డీటెయిల్స్ అతని అడ్రస్సు తెలిసిన వారు నరసరావుపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయలన్నారు. ఫోన్ నెంబరు 9440796224.